ఎన్‌వోసీలు ఆపండి

- ‘పక్కాగా స్కెచ్’పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- ప్రత్తిపాడులో నలుగురు తహసీల్దార్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తుదారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా 7

నీరు ఎరుపెక్కింది!

ఇటు గోదారి!



కోటిపల్లి వద్ద గోదావరిలో ప్రవహిస్తున్న ఎర్రనీరు

ఇటు గోదారి, అటు సంద్రం.. రెండూ ఎరుపెక్కాయి. గోదావరి ఎగువప్రాంతాల నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ వస్తోంది. దీంతో జిల్లాలో జొన్నాడ, కోటిపల్లి, యానాం, ఇతర ప్రాంతాల్లోను గోదావరికి ఎర్ర నీరు వస్తోంది. దీంతో మంగళవారం కోటిపల్లి పుష్కరాల రేవులోను, అల్లవరం మండలం ఓడలరేవు మొగ ద్వారా వైనతేయ నది నీరు సముద్రంలో కలవడంతో నీరు ఎరుపు రంగులోకి మారింది.

-కె.గంగవరం/అల్లవరం

అటు సంద్రం!



అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో వరదనీటితో ఎర్రగా మారిన సముద్రం



టెన్షన్‌లోను..!

కార్పొరేషన్ రుణాలకు ఎదురుచూపులు

- రెండు నెలల కిందట నిలిపివేత
- 5,137 యూనిట్లు మంజూరు
- 45,765 దరఖాస్తులు రాక
- ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి
- సీఎం దృష్టికి సమస్య
- పెంపు యోచనలో నిలిపివేత
- రెండు నెలలైనా తేలని నిర్ణయం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి రుణ యూనిట్లకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ తరహా రుణాలను ఐదేళ్లు పూర్తిగా నిలిపివేసింది. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్ రుణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అంతా సంబరపడ్డారు. తీరా రుణాలు మంజూరైనట్టే అయి నిలిచిపోవడంతో అసలు వీటిని ఎప్పుడు తిరిగిస్తారో తెలియక పడిగాపులు కాస్తున్నారు .ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రుణాలకు వేలల్లో పోటీ నెలకొనగా.. యూనిట్లు వందల్లోనే ఉండడంతో ఎక్కడి కక్కడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో యూనిట్ల సంఖ్య మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరడంతో తదుపరి నిర్ణయం కోసం రుణాలు మంజూరు చేయకుండా నిలిపివేశారు. ఇప్పటికే రెండు నెలలు దాటడంతో అసలెప్పుడు వీటిని ప్రభుత్వం మంజూరు చేస్తుందోనని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 5,137 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా.. అదే స్థాయిలో మళ్లీ కోటా పెంచవచ్చని భావిస్తున్నారు.

మంజూరు చేసిన యూనిట్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల కింద భారీగా స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 2,405 రుణ యూనిట్లను మంజూరు చేశారు. వీటి కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బులతయారీ, మొబైల్ కార్ వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో,కారు, గూడ్స్ ట్రక్‌వంటి వ్యాపారాలు చేసుకునేలా యూనిట్లు నిర్ణయించారు. ఆయా వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ మేరకు సామాజికవర్గాలవారీ దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది.

యూనిట్లు పెంచే యోచన..

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ పథకం అమల్లోకి రావడంతో దరఖాస్తుదారులు వేలల్లో పోటెత్తారు. ఎంపికకాని వేలాదిమంది పేద యువత, నిరుద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. అటు ఎమ్మెల్యేల అనుచరులు సైతం అర్హత ఉన్న తమవారికి కూడా యూనిట్లు రాలేదని విన్నవించారు. దీంతో నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. యూనిట్లు పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ల్లోను జిల్లాల అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. దీంతో ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తింపజేయాలని సమాచారం పంపించారు. అదనపు యూనిట్లు మంజూరు చేస్తామని రెండునెలలు దాటుతున్నా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో అప్పటికే ఎంపికైన లబ్ధిదారులు, కొత్త యూనిట్లు వస్తాయని ఆశతో ఉన్న వారు నిరీక్షిస్తూ కూర్చున్నారు. అసలు వీటిని ఎప్పుడు విడుదల చేస్తారంటూ జిల్లాల్లో ఆయా శాఖల అధికారులను అదే పనిగా సంప్రదిస్తున్నారు. అయితే యూనిట్ల పెంపు ఖాయమని, అది ఎప్పుడనేది తమకు కూడా సమాచారం లేదని జవాబు ఇస్తున్నారు.ప్రభుత్వం మాత్రం నియోజకవర్గాల వారీగా ఆయా సామాజికవర్గ అవసరాలను బట్టి త్వరలో కోటా నిర్ధారించి యూనిట్ల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల తరపున కోటా కాకుండా ఎక్కువమంది సామాన్య యువతకు యూనిట్లు అందేలా సంఖ్యను నిర్ధారించి త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.



గత ఐదేళ్లు.. రుణ ఊసేలేదు..

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు కార్పొరేషన్లను అటకెక్కించేసింది.నిరుద్యోగులకు రుణ సదుపాయం కల్పించకుండా వారిని ఇబ్బంది పెట్టింది.2019నాటికి మునుపటి టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్న రుణాలు, పనిముట్లను సైతం మూలనపారేసింది. ఒకరకంగా చెప్పాలంటే ఐదేళ్ల పాటు ఈ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయకుండా నిరుద్యోగులను ఇబ్బంది పెట్టింది. ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ బీసీ,కాపు, ఎస్సీ,ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు.

వేలల్లో దరఖాస్తులు


యూనిట్లు వందల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడలో రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోన సీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీపడ్డారు. ఈడ బ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మం జూరు చేయగా 6 వేల మంది దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూ రవగా 5,497, కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తులు చేశారు.



ఏటిగట్టుకు.. రక్షణ ఏదీ?

ఆధునికీకరణకు నోచుకోని ఏటిగట్టు

- ఐ.పోలవరంలో ఐలెండ్ చుట్టూ 40 కిలోమీటర్ల మేర శిథిలస్థితిలో ఏటిగట్టు రహదారి
- గోదావరి రక్షణ గట్ల ఆధునికీకరణకు రూ.395 కోట్లతో ప్రతిపాదనలు
- అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణం కూడా చేపట్టాలని ప్రజల వినతి



ఐ.పోలవరం మండలం కేశనకుర్రు వద్ద బీటలు తీసిన రక్షణగట్టు

ఐ.పోలవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గోదావరి రక్షణ గట్టుకే రక్షణ లేకుండా పోయింది. వరదొస్తే కాపాడాల్సిన ఆ ఏటిగట్టు రహదారే బలహీనంగా మారి భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీన్ని పటిష్టం చేసే నిమిత్తం ఆధునికీకరణ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో ఎదురుచూపులు తప్పడంలేదు.

త్వరగా నిర్మించాలి..

ఐ.పోలవరం మండలం ఐలెండ్ చుట్టూ 40 కిలోమీటర్ల మేర ఏటిగట్టు ఉంది. ఈ రహదారి ఎక్కడికక్కడ దిగబడి అధ్వానంగా మారడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం ఆ ప్రాంతవాసులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధతో గోదావరి ఏటిగట్ల ఆధునికీకరణకు చర్యలు ప్రారంభించారు. ఇందులోభాగంగా రూ.395కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 1996 తుఫాన్ తర్వాత గోదావరి ఏటిగట్లను అప్పట్లో ఆధునికీకరించారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృషితో 1998-2000 కాలంలో రూ.13కోట్లతో ఈ 40కిలోమీటర్ల మేర ఏటిగట్టును అభివృద్ధి చేశారు. పాతికేళ్ల క్రితం ఆధునికీకరించిన ఏటిగట్లు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గత పాలకులు ఏటిగట్ల అంశాన్ని ప్రతిపాదనలకే పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఏటిగట్టు రోడ్లకు మోక్షం లభిస్తుందని ఐలెండ్ వాసులు ఆశపడుతున్నారు. 2015 పుష్కరాలకు మురమళ్ల నుంచి కేశనకుర్రుపాలెం వరకు ఏటిగట్టు రోడ్డును ఆధునికీకరించారు. అది కూడా అనతికాలంలోనే శిథిలమైంది. కేశనకుర్రువెళ్లే ఏటిగట్టు రోడ్డు బీటలు తీయడంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురులంక-జి.మూలపొలం రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు ఎక్కడికక్కడ దిగబడింది. చమురు కంపెనీల వాహనాల రాకపోకలతో ఏటిగట్టు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. గుత్తెనదీవి నార్త్‌అద్దాల కాల్వఅవుట్‌ఫాల్ స్లూయిజ్‌వద్ద ఐరన్ వంతెన తుప్పు పట్టి శిథిలావస్థకు చేరడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. త్వరగా నిధులుమంజూరు చేసి రక్షణగట్టు రోడ్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా..

- ఓడలరేవు తీరంలోని దేవస్థానం భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు
- సీఆర్‌జడ్ పరిధిలో అనుమతి లేకుండా తవ్వడంపై స్థానికుల ఆగ్రహం



అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో దేవస్థానం భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు

అల్లవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌జడ్ పరిధిలో దేవస్థాన భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయి. అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులు తవ్వేశారు. దీనిపై పలువురు పర్యావరణవేత్తలు, స్థానికులు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. పదిరోజుల క్రితం ఓడలరేవు సీతారామాలయం దేవస్థానానికి చెందిన 9ఎకరాల భూమిని వేలం పాట నిర్వహించారు. వేలం పాడుకున్న వ్యక్తి సముద్ర తీరంలో ఈ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువుల తవ్వకాలు చేపట్టారు. సీఆర్‌జడ్ పరిధిలో సముద్ర తీరలో 500 మీటర్ల పరిధిలో ఎటువంటి చెరువులు తవ్వరాదని ప్రభుత్వ ఆంక్షలు ఉన్నాయి. సదరు దేవస్థాన భూమిలో వేలం పాడుకున్న వ్యక్తి సరుగుడు తోటలు పెంచుకోవాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువుల తవ్వకాలు చేపట్టారు. వైనతేయ నదీ తీరంలో మరో ఐదెకరాల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు జరిపారు. ఓడలరేవు తీరం వెంబడి అటవీశాఖ భూముల్లో ఆక్వా చెరువులు దర్శనమిస్తున్నాయి.

తీరంలో చెరువుల తవ్వకాలు ఆపేశాం

ఓడలరేవు సముద్రతీరంలో దేవస్థాన భూముల్లో ఆక్వా చెరువులు తవ్వుతున్నారన్న సమాచారం తెలుసుకుని వాటి తవ్వకాలను ఆపివేశామని అల్లవరం తహశీల్దార్ వీవీఎల్ నరసింహం అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వితే చర్యలు తప్పవన్నారు.

కోనసీమలో ఆరు అడ్వెంచర్ పర్యాటక పాయింట్లకు టెండర్లు: కలెక్టర్



పర్యాటకశాఖ అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

అమలాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ తీరం వెంబడి పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా ఆరు అడ్వెంచర్ టూరిజం పాయింట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక రంగ, అడ్వెంచర్ టూరిజం ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం మంగళవారం నిర్వహించి టెండరు ప్రతిపాదనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గోదావరి తీరం వెంబడి దిండిలో మూడు పాయింట్లు, దిండి-అంతర్వేది మధ్య ఒక పాయింటు, అంతర్వేదిలో మరో పాయింటు, ఆత్రేయపురంలో ఒక పాయింటు అడ్వెంచర్ టూరిజం కోసం ఎంపిక చేశామన్నారు. ఏజెన్సీలు వాటరు యాక్టివిటీ అడ్వెంచర్ కార్యక్రమాల విధి విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు, అంచనా వ్యయాలతో నివేదికలు రూపొందించుకుని ఈనెల 15న హాజరుకావాలని ఆదేశించారు. సీ ప్లేన్, బోటింగ్ యాక్టివిటీ వంటి అడ్వెంచర్ యాక్టివిటీలపై మూడు ఏజెన్సీలు స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. స్టాండర్డ్ ఆఫ్ ఆపరేషన్, సెక్యూరిటీపరంగా తీసుకునే భద్రతా ప్రామాణిక చర్యల నివేదిక కూడా సమర్పించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఫ్రీక్ అవుట్ ఏజెన్సీ దిండిలో మూడు పాయింట్లను ఎంపిక చేసిందన్నారు. ఆత్రేయపురంలో శివశంకర వాటర్ స్పోర్ట్స్‌వారు ఒక పాయింటు, అంతర్వేదిలో బోటింగ్‌వారు ఒక పాయింటు ఎంపిక చేసుకున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, మూడు కంపెనీల ప్రతినిధులు, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు పవన్‌కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి అన్వర్, పర్యాటకశాఖ బోటింగ్ అధికారి గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంపొందించాలి : జేసీ నిషాంతి

అమలాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పౌరులకు ప్రభుత్వ సేవలు అందించడంలో సంతృప్తి స్థాయిల్లో పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. మంగళవారం అమరావతి నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలనా ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, మరో కార్యదర్శి ప్రభాకరరెడ్డి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం జేసీ నిషాంతి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీలకు శ్మశానవాటిక లేని గ్రామాల్లో వాటి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సేకరిస్తున్న సంతృప్తి స్థాయిలో తక్కువగా నమోదవుతున్నాయన్నారు. పీజీఆర్ సమస్యల పరిష్కారానికి మెరుగైన పనితీరు అవసరమని సూచించారు. విశ్రాంత తహశీల్దార్లు, ఉపతహశీల్దార్లను నియమించుకుని వారికి ఉన్న అనుభవాలు, సలహాలు, సూచనలతో అర్జీలపై విచారిస్తూ నూరుశాతం సంతృప్తిస్థాయిలు పొందాలని కోరారు. తల్లికి వందనం పథకం అమలులో తిరస్కరణకు గురైన లబ్ధిదారులకు మళ్లీ దరఖాస్తులను విచారించి విభజన చేసి అర్హులకు అవకాశమివ్వాలన్నారు. భూసర్వే ప్రక్రియ 2027, డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్, గ్రామసభల నిర్వహణ చేపట్టాలన్నారు. త్వరలో డిజిటల్ పాస్ పుస్తకాలు వస్తాయని, పాత పుస్తకాలను ఇచ్చి కొత్త పుస్తకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూయాజమాన్యాలకు అందించాల్సి ఉంటుందన్నారు. భూపరిపాలనా, రీసర్వే అంశాలపై మండలస్థాయి నుంచి సమీక్షిస్తూ ఆశించిన పురోగతిని తీసుకురావాలన్నారు. 706 లేఅవుట్లలో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించి అర్హులకు అందించాలని ఆదేశించారు. డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు మాధవి, శ్రీఖర్, అఖిల పాల్గొన్నారు.

మెగా పీటీఎంను పండుగలా నిర్వహించాలి

- డిప్యూటీ కలెక్టర్ మమ్మీ

ముమ్మిడివరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 2.0ను పండుగ వాతావరణంలో నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2150 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఈ మెగా పీటీఎం నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు. మెగా పీటీఎం నిర్వహణకు ఇప్పటికే సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలలకు విడుదల చేసిన కాంపోజిట్ గ్రాంట్స్‌నుంచి 20శాతం నిధులు ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేయడానికి వెసులుబాటు కల్పించినట్టు ఆమె తెలిపారు. మెగా పీటీఎం సందర్భంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే సమావేశాల్లో విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేస్తామన్నారు. సమావేశాలకు హాజరైవారంతా వారి చిన్నారుల భవిష్యత్తు నిర్దేశానికి మార్గదర్శులు కావాలని కోరారు.

24 వరకు ఆర్టీసీ ఏసీ బస్సుల టిక్కెట్ ధరల తగ్గింపు: డీఎం

అమలాపురం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరే ఏసీ బస్సులకు ఈనెల 24వతేదీ వరకు ప్రత్యేక తగ్గింపు ధరలు ఇస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. తగ్గించిన టిక్కెట్ ధరల వివరాలు ప్రకటించారు. అమలాపురం డిపో నుంచి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు వెళ్లే అమరావతి ఏసీ బస్సుకు ప్రస్తుత టిక్కెట్ ధర రూ.1430 కాగా రూ.1170కు టిక్కెట్ ధర తగ్గించామన్నారు. హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు వెళ్లే నైట్‌రైడర్ ఏసీ బస్సు ధర రూ.1190 కాగా రూ.980కు తగ్గించారు. బెర్త్ ప్రస్తుత ధర రూ.1390 కాగా రూ.1130కు తగ్గించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే నైట్‌రైడర్ ఏసీ టిక్కెట్ ధర రూ.1280 కాగా రూ.1050కు తగ్గించగా ప్రస్తుత బెర్త్ రూ.1480 కాగా రూ.1220కు తగ్గించారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఇంద్ర బస్సు టిక్కెట్ ధర రూ.1140 కాగా రూ.990కు తగ్గించారు. అమలాపురం నుంచి విజయవాడ వెళ్లే ఇంద్రబస్సు ప్రస్తుతధర రూ.510 కాగా రూ.470కు, విశాఖపట్నానికి వెళ్లే ఇంద్ర బస్సు టిక్కెట్ ధర రూ.580 కాగా రూ.530కు తగ్గించారు. ఈ అవకాశం ఈనెల 24 వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందన్నారు. పైన తెలిపిన తగ్గింపు ధరలకు అదనంగా ఒకేసారి అప్ అండ్ డౌన్ టిక్కెట్లు తీసుకునేవారికి అదనంగా పదిశాతం రాయితీ పొందవచ్చునన్నారు.





సెల్..రేగితే.. చెరసాలే!

- సోషల్ మీడియాలో రాంగ్ పోస్టులు వద్దు
- అసభ్యకర, అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోం
- పోస్టులు పెట్టే ముందు ఆలోచించండి
- తప్పుడు పోస్ట్ ఫార్వర్డ్ చేసి ప్రమాదంలో పడొద్దు
- అడ్మిన్లూ.. రాంగ్ పోస్టుల బాధ్యత మీదే..
- కాకినాడ జిల్లా పోలీసుల హెచ్చరిక.. విస్తృత ప్రచారం

చేతిలో సెల్‌ఫోన్ ఉంది. సోషల్ మీడియాలో 'సెల్'రేగిపోదాం.. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాలో రెచ్చిపోదాం. అసభ్యకర, అసత్య పోస్టులు పెడుతూ అలజడి రేపుదాం అనుకునే వారికి షాక్ ఇస్తున్నారు కాకినాడ జిల్లా పోలీసులు. ఇష్టానుసారంగా తప్పుడు సందేశాలను, సంకేతాలను ప్రజల మధ్యకు పంపుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని కటకటాల వెనక్కి నెడుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ.. ప్రచార పైశాచికానందాన్ని పొందుతున్న వారి సరదా తీర్చేస్తున్నారు. ఇటీవల జరిగిన అరెస్టులే ఓ హెచ్చరిక అనుకోవాలని వార్నింగ్ ఇస్తున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖలో జూన్ 21న జరిగిన ప్రపంచ యోగా దినోత్సవం-2025 కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలించపరిచేలా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్' వేదికగా, అవమానకరంగా పోస్టును విడుదల చేసి దాన్ని షేర్ చేసిన ఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో జనసైనికులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవమానపరుస్తూ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా అవమానకరంగా పోస్టు పెట్టిన ఈ కేసుపై కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆ పోస్టులు ఎవరు పెట్టారు? వారి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపారు. దీనిలో భాగంగా జూన్ 24న వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానం ప్రాంతానికి చెందిన కర్రి వెంకటసాయి వర్మ (ఏ2), మచిలీపట్నం మండలం వలందపాలెం గ్రామానికి చెందిన పాముల రామాంజనేయులు(ఏ3), హైదరాబాద్ సరూర్‌నగర్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మెహబూబ్(ఏ4) ఉన్నారు. ఇదే కాదు.. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా పరిధిలో మరెన్నో జరుగుతున్నాయి.



వాయు వేగాన్ని మించి..

'నిజం గుమ్మం దాటే లోపు.. అబద్ధం ఊరంతా చుట్టేసి వస్తుందన్న' చందంగా ఉంది సోషల్ మీడియా తీరు. మంచి విషయాలు పక్కన పెడితే.. అసత్య ప్రచారాలు అధికంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా నేడు ఒకరిపై ఒకరు దుమ్మెత్తుకొని పోసుకునే ఆయుధంగా మారింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేందుకు వీలుగా తయారైంది. ఒకరు పోస్టు పెట్టడం, దానికి మరొకరు కౌంటర్‌గా కామెంట్ చేయడం, దాన్ని మరి కొందరు లైక్ చేయడం, షేర్ చేయడం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, ఎక్స్.. ఇలా అన్ని ప్లాట్‌ఫాంలలోనే హల్‌చల్ చేయడం, వివాదాలకు దారి తీయడం ఇలా వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే చాలు వెంటనే వీడియో/ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం నేడు కొందరికీ అలవాటుగా మారింది. అసలు అందులో వాస్తవమెంత? ఎవరు తీశారు? ఇది షేర్ చేయడం వల్ల ఇబ్బందులేమైనా ఎదురవుతాయా? అనే విషయాలను ఆలోచించకుండానే కొందరు అసభ్యకర, అవమానకర పోస్టులను షేర్ చేసి ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు.

షేర్ చేసినా నేరమే..

సోషల్ మీడియాలో అనుచితమైన సందేశాలను పోస్టు చేయడమే కాదు.. షేర్ చేసినా తీవ్ర తప్పిదంగా పరిగణిస్తున్నారు. పోస్టు చేసిన వ్యక్తితోపాటు.. ఆ పోస్టు షేర్ చేసిన వారి సోషల్ మీడియా ఐడీలను గుర్తిస్తున్నారు. మెసేజ్ మొదట ఎక్కడినుంచి వచ్చింది? దాన్ని ఎవరెవరు షేర్ చేశారు? ఏ వాట్సాప్ గ్రూపులో తిరుగుతోంది? దాని అడ్మిన్ ఎవరు? ఎందుకు పోస్టు చేశారు? ఇలా రకరకాలుగా ఆరా తీస్తున్నారు. సిస్టమ్ ఐపీ నెంబర్ ఆధారంగా ఏ కంప్యూటర్ లేదా ఏ మొబైల్ నుంచి ఆ మెసేజ్ బయటకు వచ్చింది.. వంటి విషయాలను ప్రత్యేక ఐటీ నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించి సోషల్ మీడియాలో పైశాచిక ఆనందం పొందుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. కటకటాల వెనక్కి నెడుతున్నారు. జిల్లాలోని సోషల్ మీడియాను ప్రభావితం చేసేలా రెగ్యులర్ పోస్టింగ్‌లు చేస్తున్న వారిపైనా ప్రత్యేక నిఘా పెడుతున్నారు. గ్రూప్ అడ్మిన్‌లు ఎవరు? వారి నేపథ్యమేంటి? క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

సమస్యలు తెచ్చుకోవద్దు

కాకినాడ జిల్లా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి. సోషల్ మీడియాను ఇష్టారీతిన వాడి సమస్యలు కొని తెచ్చుకోవద్దు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టే ముందు జాగ్రత్త వహించాలి. నిర్ధారించుకోకుండా ఏ మెసేజ్ ఫార్వర్డ్ చేయొద్దు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే జైలుకు వెళ్తారు. తప్పుదోవ పట్టించే ఫొటోలు, వీడియోల జోలికి వెళ్లొద్దు. నిజనిర్ధారణ లేకుండా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు.

- బిందుమాధవ్, ఎస్పీ కాకినాడ జిల్లా

ఐటీ చట్టాల ప్రకారం శిక్షలు..



ముఖ్యంగా ఎదుటి వారి వ్యక్తిగత విషయాలు, జీవితాలు, వారిని కించపరుస్తూ, అసభ్యపదజాలంతో దూషిస్తూ, అవమానకరంగా చిత్రీకరిస్తూ, వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ ప్రవర్తిస్తే 66డీ ఐటీ యాక్ట్, 67ఏ ఐటీ యాక్ట్, 66ఈ ఐటీ యాక్ట్‌ల ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేస్తారు.

- 66డీ ఐటీ యాక్ట్ : కంప్యూటర్‌ను ఉపయోగించి డిజిటల్ మార్గాల ద్వారా ఎవరినైనా మోసం చేస్తే ఈ చట్టం ద్వారా పోలీసులు అరెస్టు చేస్తారు. ఉదాహరణకు నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌ను సృష్టించడం, ఆన్‌లైన్ ఖాతాల ద్వారా అనధికార మోసాలకు పాల్పడితే ఈ సెక్షన్ వర్తింపజేస్తారు. మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు.
- 67(ఏ) ఐటీ యాక్ట్ : సెల్‌ఫోన్లలో అసభ్యకరమైన వీడియో సందేశాలు పోస్టు చేస్తే తీవ్రమైన నేరంగా ఈ యాక్ట్‌లో పరిగణిస్తారు. ఇందులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా విధిస్తారు.
- 66ఈ ఐటీ యాక్ట్ : ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా, వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించి అవమానకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఈ సెక్షన్ ద్వారా చర్యలు తీసుకుంటారు. జైలు శిక్ష, జరిమానా రెండూ ఉంటాయి.



ముచ్చటగా ముగ్గురు!

ముగ్గురు విద్యార్థులు... ఒక టీచరు... ఈ చిత్రంలో కనిపిస్తున్నది అదే... కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తపల్లి స్పెషల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత పరిస్థితి ఇదీ... ఇక్కడ గతంలో వందలాది మంది విద్యార్థులు చదువుకున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 200-250 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. టీచర్లు కొత్తపల్లి మండలం బదిలీ కోరుకొంటే ఈ పాఠశాలలో పని చేసేందుకు సుముఖత వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి తారుమారైంది. ఒకటో తరగతిలో ముగ్గురే పిల్లలుండగా ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

'ప్రసాద్' పథకంలో అన్నవరం ఆలయ అభివృద్ధి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం అమలు చేస్తోంది. దీనిద్వారా కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న పనులకు సంబంధించిన టెండర్లను వచ్చే వారం ఖరారు చేయనున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



డొక్కా సీతమ్మ విగ్రహం వద్ద ఆమె బంధువులు

డొక్కా సీతమ్మ విగ్రహ సందర్శన

సర్పవరం జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్య వెంకటరామలక్ష్మి ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని మంగళవారం ఆమె బంధువులు సందర్శించారు. అందులో ఒకరైన నరసింహమూర్తి మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేర్గాంచిన సీతమ్మ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ దాత రామలక్ష్మి, హెచ్‌ఎం గాయత్రి, ఇన్‌చార్జి పి.శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు

- గంజాయికి కేరాఫ్ దాడిశెట్టి రాజా
- సీటు కోసం పవన్ చుట్టూ జక్కంపూడి ప్రదక్షిణలు
- జనసేన నేతలు తుమ్మల, పంతం



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేతలు తుమ్మల, పంతం

పిఠాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, వేగుళ్ల లీలాకృష్ణలతో కలిసి మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతల వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఓడిపోయి పనిలేకుండా ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఇక్కడకు పంపించి అవాకులు, చవాకులు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు జక్కంపూడి రాజా, దాడిశెట్టి రాజా.. జగన్ వద్ద మార్కులు కోసం వారు ఇచ్చిన స్క్రిప్ట్ చదివారని విమర్శించారు. తునిలో దాడిశెట్టి గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఆరోపించారు. గతంలో సీటు కోసం పవన్‌కల్యాణ్ కార్యాలయం చుట్టూ తిరిగిన రోజులను జక్కంపూడి మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో నిస్వార్థంగా ప్రజలు కోసం పనిచేస్తున్న వ్యక్తి పవన్‌కల్యాణ్ అని అన్నారు. ఎమ్మెల్యే అయిన ఏడాదిలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ చేసిన అభివృద్ధిపై అవాకులు చవాకులు మాట్లాడిన వైసీపీ నేతలు చర్చకు రావాలని వారు సవాల్ చేశారు. సమావేశంలో గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊటా నానిబాబు, జనసేన మహిళా విభాగం కో-ఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 9 మందికి కారుణ్య ఉద్యోగాలు



ఉద్యోగ నియామకాలు పొందిన వారితో ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలో పని చేస్తూ సహజ మరణాలతోపాటు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 9 మందికి కండక్టర్ గ్రేడ్-2 కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈ నియామకపత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం డిపోలో ముగ్గురు, రావులపాలెం డిపోలో ఒకరు, కాకినాడ డిపోలో ముగ్గురు, రామచంద్రపురం డిపోలో ఒకరు ఉద్యోగాలు పొందారని జిల్లా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు, ఏలేశ్వరం, కాకినాడ, రామచంద్రపురం, తుని డిపోలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తూ సహజ మరణం, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు ఈ కారుణ్య నియామకాలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

ఖాళీస్థలాల టెండర్ల ప్రక్రియపై అవగాహన సదస్సు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన 11 ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడానికి సంబంధించిన టెండరు ప్రక్రియపై మంగళవారం రాజమహేంద్రవరంలోని ట్రైనింగ్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శివరామ్ (విజయవాడ), జిల్లా ఆర్టీసీ అధికారి వైఎస్ఎన్ మూర్తి, కాకినాడ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఎస్.కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 21 మంది ఔత్సాహిక వ్యాపారులు పాల్గొన్నారని, అనుమతించిన వ్యాపారాలు పదిహేనేళ్లపాటు చేసేందుకు వారికి స్థలాల వివరాలను తెలియజేశామని జిల్లా ఆర్టీసీ అధికారి తెలిపారు.

1,065 లీటర్ల స్పిరిట్ స్వాధీనం

- 10 మంది నిందితుల అరెస్టు
- స్పూరియాస్ లిక్కర్ కేసును ఛేదించిన ఎక్సైజ్ పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనరు చైతన్య మురళి ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరులో స్పూరియాస్ లిక్కర్ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కె.రవితేజ, కానిస్టేబుళ్లు జి.హనుమంత రావునాయుడు, ఎం.భవనారాయణలను చైతన్య మురళి సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి 1,065 లీటర్ల స్పిరిట్, అధిక మొత్తంలో విస్కీ సీసాలు, ఒక ఇరాస్ కేప్ సీలింగ్ మిషన్, 6000 ఖాళీ సీసాలు, క్యాప్‌లు, ఒక కిలో కేరమిల్, ఒక ఆటోను స్వాధీ నపర్చుకున్నట్టు డీసీ వివరించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న స్పిరిట్‌ను హైదరాబాద్ నుంచి తెచ్చినట్టు గుర్తించి ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్ పంపించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై సమాచారమివ్వాలి

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అవినీతిపై సమాచారాన్ని తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం రేంజ్ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. తూర్పు గోదావరికి సంబంధించి 9440446161, కాకినాడ 8332971041, కోనసీమ 9440446163 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా, ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నా తెలియజేయాలన్నారు. లంచం తీసుకోవడమే కాకుండా ఇవ్వడం కూడా చట్ట ప్రకారం నేరమేనని ఆయన పేర్కొన్నారు.

గుబ్బాలమ్మకు మంత్రి పూజలు

నిడదవోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మ వారికి మంగళవారం ఆషాఢ మాసం సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు రఘుకుమార్ శర్మ ఆశీర్వచనాలు అందించారు. ఉదయం నుంచి మహాలక్ష్మి హోమం, మహా పూర్ణాహుతి, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గోపవరంలో మంత్రి దుర్గేష్‌కి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

బెదిరిస్తే చూస్తూ ఊరుకోం

- ముద్రగడ క్రాంతి ఫైర్

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో తనకు సహకరించేవారిని బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె ముద్రగడ క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె కాకినాడ జిల్లా పెదశంకర్లపూడిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదశంకర్లపూడి సర్పంచ్ సూర్నీడి నాగరత్నం స్వగృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ తన అనుచరులు, మద్దతుదారులను సోదరుడు, ప్రత్తిపాడు వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. తనకు జనసైనికులు, నాయకులు సహకరిస్తున్నారని అందువల్లే బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. సమావేశంలో కూటమి, జనసేన నాయకులు సూర్నీడి సురేష్‌కుమార్, బొంకు నాని, నల్లల రామకృష్ణ, మేకల కృష్ణ, కోరుకొండ అప్పారావు, సీరం శ్రీను, సూర్నీడి వీరబాబు, కుప్పిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పెదశంకర్లపూడిలో మీడియాతో మాట్లాడుతున్న క్రాంతి

లైంగిక వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన ఒంటరి మహిళను అదే గ్రామానికి చెందిన మర్రి శోభన బాబు లైంగికంగా వేధిస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి విచారిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఒంటరి మహిళ సోమవారం తన ఇంట్లో వంట చేస్తుండగా శోభనబాబు వెళ్లి అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఆమె తలకు దెబ్బతగిలింది. దీంతో తాడేపల్లిగూడెంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. సోమవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి ఒకరి మృతి

నల్లజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణ (47) ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుమందు సేవించాడు. దీంతో ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం గోపాలకృష్ణ వ్యవసాయ కూలీగా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యసత్యవతి, కుమార్తె ఉన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు!

- రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు
- ఉపాధి శ్రామికుల ఖాతాల్లో రూ.70,190 జమ
- మేటు హస్తం ఉన్నట్టు గుర్తించిన అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో ఫారం పాండ్ నిధుల్లో భారీ అవకతవకలు జరిగాయి. పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని ఆడిట్ ఉందని హడావుడిగా జేసీబీతో పనులు చేస్తుండగా ప్రజలు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫారం పాండ్ పనులు కింద్ర పంచాయతీ ముంజవరప్పాడులో ఈ ఏడాది మార్చిలో కాకర ఎర్రయ్య అనే వ్యక్తి భూమిలో జరిగాయి. అయితే ఈ పనులను ఉపాధి శ్రామికులతో చేయించకుండానే అధికారులు సంబంధిత శ్రామికుల ఖాతాల్లో జమచేశారు. ఆ సొమ్ముల్లో రోజుకు రూ.100 తమ వద్ద ఉంచి మిగిలిన సొమ్ములను బలవంతంగా సంబంధిత మేటు తీసుకున్నాడని ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బయపడిన సదరు వ్యక్తి సామాజిక తనిఖీ జరుగుతుందేమోనని హడావుడిగా ఆదివారం ఆ భూమిలో జేసీబీలతో పనులు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం డ్వామా పీడీ, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం ఏపీడీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. అలాగే మంగళవారం ఏపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 238 పనిదినాలు పనిచేసినట్టు చూపి రూ.70, 190 బిల్లులు జరిగాయని, అయితే ఇక్కడ పనులు జరగలేదని గుర్తించామన్నారు. ఈ పనులు జరిగినట్టు రికార్డు చేసిన టెక్నికల్ అసిస్టెంట్, బిల్లులు అప్రూవ్ చేసిన ఏపీవో, ఎంపీడీవోపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా మండల వ్యాప్తంగా ఇదే రీతిలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి మాఫియా బరితెగింపు!

- పంగిడి చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పొలం మెరక చేసుకోవాలని రైతుల పేరుతో దరఖాస్తులు
- 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి... తవ్వింది లక్షపైనే
- ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున రవాణా
- రూ.లక్షల్లో దోచుకుంటున్న అక్రమార్కులు



పంగిడి చెరువులో సాగిస్తున్న మట్టి తవ్వకాలు

పెద్దాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అధికారులంటే భయం లేదు... ప్రజలు గమనిస్తారన్న లెక్కే లేదు... రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ధైర్యమో లేక తమను ఎవరేం చేస్తారన్న ధీమా కాబోలు.... మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పొలాల మెరక పేరుతో రైతులతో దరఖాస్తు చేయించి అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తున్నారు. 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి పొంది ఏకంగా లక్ష క్యూబిక్ మీటర్ల పైనే తవ్వేసినట్టు తెలుస్తోంది. నవకాన్ ఇన్‌ఫ్రా పేరుతో ట్రిప్ షీట్లు జారీ చేస్తూ తవ్వకాలు సాగించడంతో మట్టి అక్రమ రవాణా జరుగుతోందన్న అనుమానాలు నిజం అవుతున్నాయి. తరలిస్తున్న మట్టి ప్రధానంగా ఇటుక బట్టీలు, రియల్ వెంచర్ల కోసం పెద్ద ఎత్తున రవాణా చేస్తున్నట్టు సమాచారం. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో వెలసిన వెంచర్లకు మట్టిని రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నట్టు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం క్యూబిక్ మీటరు రూపాయి చొప్పున ఇస్తే అక్రమార్కులు అడ్డదారుల్లో మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు అటువైపు కన్నెత్తి చూడట్లేదని పలువురు చెప్తున్నారు. పెద్దాపురం, వాలు తిమ్మాపురం పరిధిలో సుమారు 64 ఎకరాల విస్తీర్ణంలో పంగిడి చెరువు ఉంది. రైతుల పేరుతో కొంతమంది అక్రమార్కులు జలవనరుల శాఖకు దరఖాస్తు చేయించి మట్టి దందాకు తెరలేపారు. దీంతో జలవనరుల శాఖ అనుమతులు మంజూ రు చేసింది. అక్రమార్కులు రంగప్రవేశం చేసి రాత్రనక, పగలనక మట్టిని టిప్పర్ల సహాయంతో తరలించుకుపోతున్నారు. నిబంధనలకు విరు ద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నట్టు అధి కారులకు తెలిసినా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు కన్నెత్తి చూడట్లేదు.



నవకాన్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న ట్రిప్ షీటు

పట్టించుకోని అధికారులు...

పొలం మెరక పేరుతో అనుమతి తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాలకు మట్టిని తరలిస్తున్నారు. సాధారణ రైతులు మట్టి కావాలని అడిగితే సవాలక్ష ఆంక్షలు విధించే జలవనరుల శాఖ అధికారులు స్థానిక నేతల సిఫార్సులతో ఆగమేఘాలపై అనుమతులు మంజూరు చేసేశారు. కాకినాడ, ఉండూరు, కరప, పిఠాపురం తదితర ప్రాంతాలకు మట్టిని తరలించేస్తున్నారు. నిత్యం 200 లారీలు పైబడి మట్టిని రేయింబవళ్లు ఇబ్బడిముబ్బడిగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈతతంగం గత నెల రోజులుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు చెబుతున్నారు.

నిబంధనలకు నీళ్లు...

పంగిడి చెరువులో ఇరిగేషన్ అధికారులు ఒక క్యూబిక్ మీటర్ లోతు వరకే పూడికతీత పేరుతో అనుమతి ఇచ్చినట్టు తెలుస్తోంది. కానీ 7-8 అడుగులు లోతున చెరువును ఎడాపెడా తవ్వేశారు. పైగా రాత్రి సమయంలో కూడా ఈ తవ్వకాలు సాగిస్తున్నారు. వాస్తవానికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే తవ్వకాలు జరగాల్సి ఉండగా మట్టి మాఫియా మాత్రం దీనిని పూర్తిగా విస్మరించింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసినా సరే అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పంగిడి చెరువులో మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. పొలం మెరక చేసుకు నేందుకు గతంలో జలవనరుల శాఖకు దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదు. పొలాలు మెరక చేసుకోవడానికి మట్టి దొరక్క సాధారణ రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు అక్రమార్కులకే ముందు అనుమతులు మంజూరు చేస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి.

జి.లక్ష్మణరావు, రైతు, పెద్దాపురం

ఆహారం రెడీమేడ్!



పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తుంటారు. అయితే వాటిని కూడా రెడీమేడ్ దుస్తుల్లా రెడీ చేసి అమ్మేస్తున్నారు. కాకినాడలో ఆటోకు ఇలా ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పెదపళ్లలో చోరీ

బీరువాలోని 11 కాసుల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి మాయం

ఆలమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్టు ఆలమూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహదేవర వెంకటదుర్గఅచ్యుతవిశాలాక్షి ఇంట్లోని బీరువాలో బంగారు, వెండి ఆభరణాలు పెట్టి ఈనెల 4న తిరుపతికి వెళ్లారు. 7న వచ్చి చూచేసరికి బీరువాలోని 11 కాసుల బంగారు, 500 గ్రాముల వెండి ఆభరణాలు దొంగతనానికి గురైనట్టు గుర్తించి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ కేసు నమోదు చేశారు.

పెట్టుబడులు రాకుండా జగన్ కుట్రలు

రాష్ట్రంలో 6లక్షల ఇళ్ల పూర్తికి ప్రణాళిక సిద్ధం : మంత్రి పార్థసారథి



తుని సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

తుని రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారని, పరామర్శల పేరుతో అరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తేవిధంగా నడుచుకుంటున్నారని సమాచార గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. కాకినాడ జిల్లా తునిలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక మొత్తంలో వస్తున్న పెట్టుబడులను చూసి జగన్ తట్టుకోలేకపోతున్నాడని, అభివృద్ధి జరిగి యువత ఉపాధి అవకాశాలు మెరుగుపడితే తమ ఆటలు సాగవని ఇప్పటి నుంచే పెట్టుబడులు రాకుండా వివిధ రూపాల్లో అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. పరామర్శలంటూ బయటకొచ్చి వీధి పోరాటాలకు ఆద్యం పోస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎంతోమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలిపోయారని, ఎన్నో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడుదారులు రాష్ట్రం వైపు క్యూ కడుతున్నారని తెలిపారు. జగన్ అరాచకాలను తిప్పికొట్టి వైసీపీని ఎప్పటికీ ప్రతిపక్షంలోనే కూర్చోబెట్టాలన్నారు. అరాచకవాదులు, అవినీతిపరులే రెడ్‌బుక్‌ని చూసి భయపడుతున్నారని, ఎవరైతే వైసీపీ పాలనలో దుర్మార్గంగా వ్యవహరించారో వారికిప్పుడు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. రఫారఫా అనే పదాలు స్వయంగా సీఎంగా పని చేసిన వ్యక్తే మాట్లాడితే రాష్ట్రంలో యువత ఎటువంటి దారి పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 కల్లా రాష్ట్రంలో 6లక్షల ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి ఉన్నారు.

ఎన్‌వోసీలు ఆపండి!

- 'పక్కాగా స్కెచ్'పై ఆంధ్రజ్యోతి కథనం ఎఫెక్ట్
- మైనింగ్ దరఖాస్తుదారులెవరికీ ఎన్‌వోసీలు ఇవ్వొద్దు
- ఉమ్మడి జిల్లాలో మైనింగ్ దరఖాస్తు దారులకు స్కెచ్‌ల విక్రయ బాగోతంపై కలెక్టర్ల ఆరా
- ఏడీ, ఇన్‌చార్జి డీడీని పిలిపించి తెరవెనుక వ్యవహారంపై నిలదీత
- అటు ఎవరెవరు ఎంత ముడుపులు ఇచ్చారో ఆరా తీయించిన కాకినాడ కలెక్టర్
- సర్వేయర్‌కు స్కెచ్‌ల కోసం డబ్బులు ఇచ్చింది నిజమేనని దరఖాస్తుదారుల అంగీకారం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 దరఖాస్తులను రప్పించి స్కెచ్‌ల పరిశీలన
- అటు అక్రమాలకు పాల్పడిన సర్వేయర్‌ను పిలిపించి హెచ్చరించిన వైనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన మైనింగ్ దరఖాస్తులకు స్కెచ్‌లు విక్రయించి భారీగా వెనకేసుకున్న వ్యవహారంలో గలీజు సర్వేయర్‌కు ఉచ్చు బిగుస్తోంది. ఒకరికి తెలియకుండా మరొకరికి మైనింగ్ స్కెచ్‌లు విక్రయించడం, అటు భారీ మొత్తాల్లో డబ్బులు గుంజేసి స్కెచ్‌లు ఒకే వ్యాపారికి అందేలా చేసి అడ్డగోలు లబ్ధి చేకూర్చిన సదరు సర్వేయర్ తీరుపై విచారణకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు ఈ అక్రమాల బాగోతంపై దృష్టిసారించారు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ, కాకినాడ గనులశాఖ ఇన్‌చార్జి డీడీగా వ్యవహరిస్తున్న ఫణిభూషన్ రెడ్డిని వీరిద్దరు పిలిపించి విచారించారు. దరఖాస్తుల దాఖలుకు తప్పనిసరిగా అవసరమైన స్కెచ్‌ల విక్రయం వెనుక అసలు ఏం జరిగిందనే దానిపై ఆంధ్రజ్యోతిలో శనివారం వచ్చిన కథనంపై ఆరా తీశారు. దరఖాస్తుదారులకు స్కెచ్‌లు విక్రయించిన ఘటనలో సర్వేయర్ పాత్ర ఏస్థాయిలో ఉంది.. మొత్తం వచ్చిన దరఖాస్తుల్లో తొలి వరుసలో ఎవరు ఉన్నారు? దరఖాస్తుదారుల దాఖలు చేసిన స్కెచ్‌లకు ఎంతెంత వసూలు చేశారు? వంటి అంశాలపై ఇద్దరు కలెక్టర్లు విచారించారు. అటు దాఖలైన మొత్తం 53 దరఖాస్తుల్లో 42 వరకు కాకినాడ జిల్లా రౌతులపూడిలో క్వారీల మైనింగ్ కోసమే రావడంతో ఈ వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్ గా ఉన్నారు. మొత్తం దాఖలైన దరఖాస్తులన్నీంటిని రప్పించారు. ఆయా మైనింగ్ స్కెచ్‌లను పరిశీలించారు. ఎవరెవరు ఎంతెంత విస్తీర్ణానికి మైనింగ్ స్కెచ్‌లు జతచేశారో లోతుగా పరిశీలించారు. ఒక్కొక్క స్కెచ్‌కు సదరు సర్వేయర్ ఎంత వసూలు చేశారు? అనేదానిపై కొందరు ఆర్‌ఐల ద్వారా దరఖాస్తుదారులకు ఫోన్లు చేయించి విచారణ చేయించారు. ఈక్రమంలో తాము సర్వేయర్‌కు స్కెచ్ కోసం ఎంతెంత ముట్టజెప్పిందీ కూలంకుషంగా వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో స్కెచ్‌ల పేరుతో డబ్బులు వసూళ్లు జరిగిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మైనింగ్ లీజుల మంజూరులో అత్యంత కీలకమైన ఎన్‌వోసీల జారీని తక్షణం నిలిపివేయాలని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహశీల్దార్లను కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ అక్రమాల బాగోతం తేలే వరకు ఏ వ్యాపారికీ నిరభ్యంతర పత్రాలు జారీ చేయకూడదని వారికి స్పష్టంచేశారు. అటు దాఖలైన దరఖాస్తులను సైతం లీజుల మంజూరుకు వీలుగా స్క్రూటినీ చేయకుండా దరఖాస్తులను సీజ్ చేశారు. అలాగే లీజుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల్లో ఇతర ప్రాంతాల వ్యాపారులు ఉన్నారా? భారీ మైనింగ్ విస్తీర్ణం కోసం ఎవరెవరు అప్లికేషన్లు వేశారనేది విచారించారు. ఇదిలాఉంటే అక్రమాలకు పాల్పడి స్కెచ్‌ల విక్రయించిన సర్వేయర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ మంగళవారం పిలిపించారు. స్కెచ్‌ల విక్రయంతో భారీగా వెనకేసుకోవడం, సర్వేయర్‌కు డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమేనని దరఖాస్తుదారులు ఇప్పటికే విచారణలో వెల్లడించిన విషయాన్ని ఆయన ఎదుట ప్రస్తావించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తలవంపులు తెచ్చేలా వ్యవహరించడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ ఎదుర్కోవాల్సిందేనని తెగేసి చెప్పారు. మరోపక్క పక్కాగా స్కెచ్ వేసి మైనింగ్ దర ఖాస్తుదారుల నుంచి లక్షల్లో డబ్బులు గుంజేసి రూ.కోటి వరకు డబ్బులు గుంజేసిన గలీజు సర్వేయర్‌పై ఆంధ్రజ్యోతిలో శనివారం, ఆదివారం వచ్చిన కథనాలపై ఇంటిలిజెన్స్ ఆరా తీసింది. సదరు సర్వేయర్ ఎవరెవరి నుంచి ఎంత వసూలు చేసింది వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపింది.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు, పోలీసులు

కాకినాడ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో ఓ ఇంట్లో అక్ర మంగా నిల్వ చేసిన రూ.5,27, 077 విలువ చేసే 11 టన్నుల 335 కిలోల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకుని కాకినాడలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కి తరలించినట్టు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.వీరాస్వామి తెలిపారు. సామర్లకోట మండలం వీకే రాయపురానికి చెందిన తలారి వీరబాబు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటాడని, అదే గ్రామానికి చెందిన అనుమోలు వరహాలు బియ్యం వ్యాపా రం చేస్తుంటాడని, వారిద్దరూ తూరంగి డ్రైవర్స్ కాలనీలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేయడంతో దాడి చేసి పట్టుకున్నామ న్నా రు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని 6ఏతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశామని ఇంద్ర పాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.దాడిలో తూరంగి వీఆర్వోలు నాగేశ్వరరావు, సునీత, ఇంద్రపాలెం పోలీసులు రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

4 కిలోల స్వాధీనం



నిందితులు, గంజాయితో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ అర్బన్ వెంకటేశ్వరనగర్ శివారు మద్ది లక్ష్మి గోడౌన్ వద్ద గంజాయి రవాణా జరుగుతున్నట్టు త్రీటౌన్ సీఐ కెవివి.సత్యనారాయణకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగా ఐదుగురు వ్యక్తులు ప్లాస్టిక్ కవర్లలో గంజాయిని కలిగి ఉండడాన్ని గుర్తించారు. నిందితుల్లో పిఠాపురం అగ్రహారానికి చెందిన సంగడాల రాజేష్ (21), పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన బోడా వీరసుబ్రమణ్యం అలియాస్ బన్ని (21), ఏఎస్ఆర్ జిల్లా చింతపల్లి మండలం బోరడొంకులు గ్రామానికి చెందిన కొర్ర సత్తిబాబు (47), గొల్లప్రోలు మండలం మార్కెండేయపురం గ్రామానికి చెందిన ఆరి అజయ్(27), పిఠాపురం చిట్టోడితోటకు చెందిన ఎర్రంశెట్టి అవినాష్ అలియాస్ పండు(21)ను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని కాకినాడ నాల్గో ఏజెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ వెల్లడించారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

భర్త, పిల్లలకు గాయాలు



పటవల సెంటర్‌లో మృతిచెందిన మహిళ

తాళ్లరేవు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మహిళ మరణించిందని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు మండలం ఇంజరం జైభీమ్‌నగర్‌కు చెందిన దడాల శేఖర్ భార్య, పిల్లలను తీసుకుని మోటారుసైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి బయల్దేరాడు. పటవల సెంటరులో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొనగా ఝాన్సీలక్ష్మి (28) అక్కడికక్కడే మృతిచెందింది. శేఖర్, పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పటవల పంచాయతీ మహిళా పోలీసు సమాచారం మేరకు కోరింగ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన లక్ష్మణ్

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ఆటోను తప్పిస్తున్న ప్రయత్నంలో వెనుక వచ్చిన ఇసుక లారీకి వ్యక్తి బలైపోయాడు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కొండ మెరకకు చెందిన పువ్వుల లక్ష్మణ్(36) పెయింటింగ్ పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం పని కోసం స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరాడు. సురాజ్యనగర్ పాలకేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో ఆటో తగిలి కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వెనుక చక్రం లక్ష్మణ్ కాళ్ల పైనుంచి వెళ్లిపోవడంతో కాలు ఛిద్రమైంది. దీంతో అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్

డ్రైవర్ మృతి



మరణించిన డ్రైవర్ నాగార్జున

దేవరపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి కంటైనర్ లారీ వేగంగా ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గాయాలతో మరణించి సంఘటన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం నుంచి బెంగుళూరుకు చిన్న సిలిండర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ మంగళవారం దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద ఎదురుగా వెళ్తున లారీని ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ నాగార్జున (30)కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. అతడు కర్ణాటక రాష్ట్రం మార్పనపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

ఏటీఎంలో మంటలు

యానాంలో ఐదు ద్విచక్ర వాహనాలు, కారు ఆహుతి



అగ్నికి అహుతైన ఏటీఎం, కారు, ద్విచక్రవాహనాలు

యానాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యానాం బస్‌స్టాండ్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో అక్కడే ఉన్న మోకానిక్ షెడ్డుకు సంబంధించిన ఐదు ద్విచక్రవాహనాలు, కారు అగ్నికి అహుతయ్యాయి. ఉదయం 7 గంటల సమయంలో ఏటీఎం నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు యానాం అగ్నిమాకశాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపుచేశారు. అయితే ఈ ఏటీఎంలో 10 రోజుల క్రితం రూ.15లక్షల90వేల నగదు పెట్టడం జరిగిందని, కొన్ని రోజులుగా ఏటీఎం రిపేరు వచ్చిందని తెరిచి చూస్తేగాని ఎంత నగదు నష్టం వాటిల్లిందో తెలియదని రాజమండ్రికి చెందిన హీటాచి అధికారులు తెలిపారు. ఏటీఎం సంబంధించి సుమారు రూ.8లక్షల వస్తునష్టం జరిగిందన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ఉండవచ్చని తెలుస్తోంది. యానాం అగ్నిమాపకశాఖ వివరాలను నమోదు చేశారు.

చెట్టుకు ఉరేసుకున్న బాలిక



మోతుగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోఉన్న కొత్తపల్లి పంచాయతీ గొందుగూడెం గ్రామంలో బాలిక ఉరే సుకుని మృతిచెందింది. మంగళవారం ఉదయం 8గంటలకు గొందుగూడెం గ్రామానికి చెందిన సేరామయ్య కుమార్తె కురాజయ రంపచోడవరం కాలేజీ నుంచి తిరిగి వచ్చి తమ పొలంలో చెట్టుకు చున్నీతో ఉరేసుకుని చనిపోయింది. సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్ఐ సాధిక్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



మరణించిన మహిళ

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం తుంగమడుగుల గ్రామ సమీపంలో రోడ్డుపక్కన గుర్తు తెలియని మహిళ ప్రమాదానికి గురైంది. దీంతో కొందరు బాటసారులు దుప్పులపాలెం ప్రభు త్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యాధికారులు సూచించారు. మృతురాలి వయస్సు సుమారు 30నుంచి40 ఏళ్ల ఉండవచ్చని, మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డతీగల, జూలై 8 (ఆంధ్యజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం భీముడుపాకలు మోదకొండమ్మ ఆలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుమారు 5 అడుగుల 7 అంగుళాల పొడవు ఉండి మృతదేహంపై పసుపురంగు డిజైన్ షర్టు, నీలం రంగుప్యాంటు, నలుపు రంగు చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల సీఐ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే 9440900768, 69కు సమాచారమివ్వాలని ఎస్ఐ వినోద్ కుమార్ కోరారు.



భీముడుపాకలు సమీపంలో లభ్యమైన వ్యక్తి మృతదేహం

అదృశ్యమైన ఇద్దరు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

మండపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం ఇంటి నుంచి హైస్కూల్‌కు బయలుదేరి కనిపించకుండా పోయారు. పోలీసులు వారి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థినులు పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు అంగర పోలీసులను ఆశ్రయించారు. వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ప్రత్యేక పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు, అంగర ఎస్ఐ జి.హరీష్, మండపేట రూరల్ ఎస్ఐ వి.కిషోర్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి బాలికల ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. బాలికలు కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి వైపు వెళ్తున్నారని సమాచారం అందుకున్న సిబ్బంది తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ, ఒంగోలు, తిరుపతి రైల్వేస్టేషన్‌లలో రైల్వేపోలీసు ప్రొటెక్షన్ ద్వారా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌ఫార్మర్స్‌తో ట్రైన్‌ను తనిఖీ చేసి రాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు బాలికలను ఒంగోలు వద్ద గుర్తించి వారిని తిరిగి అంగరకు తీసుకిచ్చి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని డీఎస్పీ తెలిపారు. బాలికల మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో చేధించిన రామచంద్రపురం డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

ధవళేశ్వరంలో ఇద్దరి అరెస్ట్

11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకువస్తున్న 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన కె.పవన్‌కుమార్, కంబాల చెరువు ప్రాంతానికి చెందిన పి.సతీష్ అలియాస్ డింపు వైజాగ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ధవళేశ్వరంలో విక్రయించడానికి తీసుకురాగా ధవళేశ్వరం సీఐ టి.గణేష్, సిబ్బందితో వారిని పట్టుకుని 11 కిలోల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పీహెచ్‌సీ తనిఖీ
మలికిపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): లక్కవరం పీహెచ్‌సీని ఎంపీపీ ఎంవీ సత్యవాణి మంగళవారం తనిఖీచేశారు. రోగుల సంఖ్య, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది రోగుల పట్ల శ్రద్ధ చూపించాలని, రోగుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. డాక్టర్ భావన ఆసుపత్రికి సంబంధించిన వివరాలను ఎంపీపీకి వివరించారు.

పేరెంట్స్ డేకు ఏర్పాట్లు
అంతర్వేది, జూలై 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం మోడల్ ప్రైమరీ స్కూలులో ఈనెల10న నిర్వహించే మెగా పేరెంట్స్-టీచర్స్‌డేకు ఏర్పాట్లు చేశారు. మోడల్ ప్రైమరీ స్కూలు లోగోను ఏర్పాటుచేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. విద్యార్థులు తాము గీసుకుని వచ్చిన చిత్రపటాలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

అధికారులు ప్రజలకు వారధిగా పనిచేయాలి

- మండల పరిషత్ సమావేశంలో
- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సమావేశానికి అధికారులు హాజరుకావడం లేదని, ఆయా శాఖల సమస్యలను ప్రజాప్రతినిధులు ఎవరికి చెప్పుకుంటారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మండల పరిషత్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎంపీడీవో ఏపీఎల్ నరసింహం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈసమావేశానికి ఆర్టీసీ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదించాలని ఎంపీడీవోను ఎమ్మెల్యే ఆదేశించారు. గంజాయి తాగినా, రవాణా చేస్తున్నా వారి వివరాలు తమకు ఇవ్వాలని, ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, విద్యుత్ శాఖల సమస్యలను పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. డ్వాక్రా సొమ్ము స్వాహా చేసిన యానిమేటర్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకాధికారిని నియ మించామన్నారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, తహశీల్దారు చినబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు


అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో టీడీపీ తొలి అడుగు ప్రచారంలో ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు టీడీపీ కూటమి పాలనతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమైందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో మంతెన సురేష్‌రాజు పర్యవేక్షణలో కొమరగిరిపట్నంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దాట్ల గోపీరాజు, పచ్చిమాల ఏడుకొండలు, పరసా కిరణ్, అల్లు సత్తిబాబు, డాక్టర్ ఎం.శ్రీనివాస్, కడలి రామకృష్ణశెట్టి, కొల్లు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

కూటమితోనే ప్రజా సంక్షేమం
ఐ.పోలవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎదుర్లంకలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముదునూరి రామలింగరాజు, సాగిరాజు సూరిబాబురాజు, అల్లూరి వెంకన్నబాబు, సాగిరాజు వాసురాజు, ముదునూరి శ్రీనివాసరాజు, సీఎం రాజు, నంబూరి సీతారామరాజు, వీధి లోవరాజు, ఆర్చ్ రాము, జనిపల్లి గిరి, కమిడి బుజ్జి, ఓలేటి శ్రీను, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం
అమలాపురం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మంగళవారం తాండవపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మండలశాఖల అధ్యక్షులు చొల్లంగి సత్యసాయిబాబా, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి వీరేశ్‌కుమార్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, నంద్యాల దొరబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, క్రైరం రాము, పరమట శరత్‌బాబు, నడింపల్లి ఉదయబాబు, మాడా మాధవి, క్రైరం సత్తిబాబు పాల్గొన్నారు.

సుపరిపాలన కార్యక్రమం
కాట్రేనికోన, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, సుపరిపాలన మండల ఇన్‌చార్జి గుత్తుల సాయి చెయ్యేరు, పెనుమల్లె, నడవపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి వెళ్లి సుపరిపాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చెయ్యేరులో రాయుడుపాలెం, జయంతివారిపుంత, పెనుమల్లె గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, సర్పంచ్ చెల్లి సురేష్, కూటమి నాయకులు వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, గుత్తుల సూర్యమహాలక్ష్మి, గిడ్డి చంటిబాబు, నంద్యాల వెంకటేశ్వరరావు, నామా వెంకిబాబు, సీఎస్ఎన్ రాజు, ఉచ్చిల వీరనారాయణ, కాశి జ్యోతిబాబు, సంసాని గంగాధర్, సాపే రూప, కాశి నరేష్‌బాబు, కొంకి శ్రీను, బూల శ్రీను, వాసంశెట్టి మోహనరావు, జనిపల్లి శ్రీనివాస్, కాండ్రేగుల ప్రసాద్, కొండేటి చినబాబు, గువ్వాల సత్తిబాబు, పాకలపాటి చిరంజీవిరాజు, యనమదల వెంకటరమణ, చీకురుమెల్లి చక్రధర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
ముమ్మిడివరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంవత్సర కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరించారు. కార్యక్రమంలో కాశి రామచంద్రరావు, పిల్లి నాగరాజు, ఎం.వెంకటరమేష్, కస్నీటి రవికిరణ్, గోడి భువనకృష్ణ, దేవరపల్లి దుర్గాప్రసాద్, సీహెచ్ దొరబాబు, ఎన్.వంశీ, బడుగు సాయి, కనుమూరి శివ, పెన్మెత్స చంటిరాజు, పి.రాహుల్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాల లబ్ధి
ఉప్పలగుప్తం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది సుపరిపాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ లబ్ధి చేకూరినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంగళవారం ఆయన కిత్తనచెరువులో ఇంటింటికి వెళ్లి గృహిణులు, యువత, పెన్షనర్లతో మాట్లాడారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పోతుల రవిప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి పండు వెంకటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు ఆకేటి పెద్ద, నీటి సంఘాల చైర్మన్లు బండారు వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, సర్పంచ్‌లు కుంచే గౌరీశ్రీనివాస్, చిక్కం జంగమయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, కూటమి నాయకులు రవణం మధు, చిక్కం ఉమేష్, పెయ్యల దుర్గారావు పాల్గొన్నారు.

లోవోల్టేజీపై ఫిర్యాదులు రాకుండా చూడండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లోవోల్టేజ్, ఇతర సమస్యలపై ఫిర్యాదులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల నుంచి లోవోల్టేజీ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. పి.గన్నవరం మండలం మానేపల్లి, మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న విద్యుత్‌సబ్ స్టేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈసందర్భంగా ఈఈ కె.రాంబాబు మాట్లాడుతూ రూ.2.80కోట్లతో పి.గన్నవరం నియోజకవర్గంలో 88చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి 45 ట్రాన్స్‌ఫార్మర్లు అందించామన్నారు. మిగిలిన 43ట్రాన్స్‌ఫార్మర్లు నెలలో ఇస్తామని ఎమ్మెల్యేకి వివరించారు. పలు చోట్ల పాడైన విద్యుత్‌స్తంభాలు, కండక్టర్స్‌కు రూ.47లక్షలతో 24చోట్ల పనులు చేపట్టామన్నారు. రాజోలు, అమలాపురం డీఈఈలు కృష్ణరాజా, జి.అన్నవరం, ఏఈలు జీవీ ఆచార్యులు, జి.వెంకటేశ్వరరావు, కవిత పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలని నిరసన
అంతర్వేది, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మంగళవారం మోరి హైస్కూలు స్టూడెంట్ కిట్స్ పాయింట్ ఆవరణలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలనే నమ్ముకున్న ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుచేసి, మినిమం టైమ్‌స్కేలు, ఇతర సమ్మెకాలపు ఒప్పందాలు, వేతనాల పెంపు, ఈపీఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలో విజయవాడలో నిరసన దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజనీకుమారి, లక్ష్మీబాయి, మాధురి, శాంతి, దివ్య, శ్రీనివాస్, సాగర్, కిశోర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి
మామిడికుదురు, జూలై 8(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తోన్న ఉద్యోగులు నిరసన చేపట్టారు. మినిమం టైమ్ స్కేలు, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసును 62ఏళ్లకు పొడిగించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. వినతిపత్రాన్ని ఎంఈవో కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో నయినాల రాజేంద్రప్రసాద్, బత్తుల శ్రీనివాస్, విప్పర్తి హేమలత, పూర్ణ, లక్ష్మీనారాయణ, మాలతీ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయండి
మలికిపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్నదాతసుఖీభవ పథకానికి కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని జిల్లా సీపీఐ ఇన్‌చార్జి డేగ ప్రభాకర్ డిమాండ్ చేశారు. మలికిపురం జరిగిన రాజోలు నియోజకవర్గ సీపీఐ నాల్గో మహాసభలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ ఈనెల19, 20,21 తేదీల్లో అమలాపురంలో జరిగే జిల్లా సీపీఐ మహా సభలకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. గెడ్డం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో దేవ రాజేంద్రప్రసాద్, చెల్లుబోయిన కేశవశెట్టి, సురేష్‌బాబు, జంపన ప్రసాదరావు, మేడిచర్ల సత్యనారాయణ, దీపాటి గంగాచలం, పిచ్చిక గంగాధర్, పుల్లెల ఆనంద్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ర్యాలీలో సత్తిబాబు, శ్రామిక మహిళా సమాఖ్య ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు కార్మికులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు పిలుపునిచ్చారు. బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతో పాటు కర్షకులు, అన్నివర్గాల ఉపాధి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఆప్కోస్, వికాస్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కొప్పుల కృష్ణ, నల్లారి సత్యనారాయణ పాల్గొన్నారు. పురపాలక సంఘంలో అత్యవసర విధుల కోసం పర్మినెంట్ కార్మికులను అందుబాటులో ఉంచేలా సూచించినట్టు సత్తిబాబు తెలిపారు. అనంతరం శ్రామిక మహిళాసమాఖ్య ప్రతినిధులతో సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ అమలాపురంలో నిర్వహించిన ర్యాలీలో సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజోలు నియోజకవర్గం


బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో రాజోలు నియోజకవర్గం ముందు వరుసలో ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కాట్రేనిపాడులంక-కొడప మధ్య రూ.1.27కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు ప్రాజెక్టుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో ఇప్పటికీ గ్రామాలను కలుపుతూ పోయే బీటీ రోడ్లను 80శాతం పూర్తి చేశామని, మిగిలిన 20శాతం రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. రాజోలు నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లను ఇప్పటి వరకు రూ.16కోట్లతో నిర్మించామని, త్వరలో ఇంకో రూ.10కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. రాబోయే రెండేళ్ల కాలంలో ఆయా గ్రామాల్లో ఉన్న సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి పెడతానన్నారు. కూటమి ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, మొల్లేటి శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, అడబాల చంటి, పినిశెట్టి బుజ్జి, సూరిశెట్టి శ్రీనివాస్, అడబాల విజయ్, ఉలిశెట్టి లక్ష్మణరావు, కొల్లు బాలకృష్ణ, కొప్పాడి కుమార్ పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిని అరికట్టండి
అల్లవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మంగళవారం బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక సచివాలయం వద్ద ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల తీరును మెరుగుపరచడం ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఆశ కార్యకర్తల సమావేశంలో పలు సూచనలు చేశారు. వైద్యాధికారి సూర్యనగేష్, సబ్‌యూనిట్ అధికారి ఎస్వీ రామారావు, వినయ్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య
అంబాజీపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిరతపూడి గ్రామానికి చెందిన దార్లంక సత్యనారాయణ(75) ఈనెల5న పురుగుల మందు తాగాడు. అతడ్ని బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుడు దార్లంక గోపికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

శాకంబరి అలంకారంలో వాసవీమాత
అమలాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం మెయిన్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శాకంబరిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారి మూలవిరాట్, ముఖ మండపాన్ని అలంకరించారు. తొలుత పట్టణ ఆర్యవైశ్య మహిళలు స్థానిక గాంధీ సెంటర్ నుంచి చీర, సారెతో మంగళ వాయిద్యాల నడుమ బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, పండ్లు సమర్పించారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు మెండు
అమలాపురం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, అందుకు తగ్గ నైపుణ్యాలను ప్రతీ విద్యార్థి పెంపొందించుకోవాలని అమెరికాలో ఫ్లెక్సీ వాన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చిక్కాల విద్యాసాగర్ పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సుపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాసాగర్‌తో పాటు న్యూరోసర్జన్ డాక్టర్ పీవీ సత్యేంద్ర మరోఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.

పీ4 సర్వేను పూర్తి చేయండి
మామిడికుదురు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను బాధ్యతాయుతంగా చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్డీవో జె.వేణుగోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సర్వేపై సమీక్ష నిర్వహించి ఈనెల10నాటికి పీ4 సర్వేను పూర్తి చేయాలని కోరారు. 20శాతం పేదలకు ధనికులు సహాయం అందించి, వారికి తోడుగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

పాన్, కూల్‌డ్రింక్ షాపుల్లో తనిఖీలు
అమలాపురంటౌన్, జూలై8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా ఈగల్ ఐజీ రవికృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం అమలాపురం పట్టణంలో పలు దుకాణాలపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలకు వంద గజాల పరిసరాల్లో పొగాకు సంబంధిత పదార్థాలు విక్రయిస్తున్న దుకాణాల్లో దాడులు జరిపి ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వడ్డిగూడెం, కొంకాపల్లి, గొల్లగూడెం, సావరం బైపాస్ తదితర ప్రాంతాల్లోని షాపులపై దాడులు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో పాఠశాలలు, కళాశాలలకు సమీపంలో ఉన్న షాపుల్లో తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న షాపుల యజమానులకు జరిమానాలు విధించారు. బండారులంక కామనగరువు తదితర ప్రాంతాల్లోని షాపులపై దాడులు జరిపినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న కూల్‌డ్రింక్, జనరల్ షాపుల్లో మంగళవారం ఎస్ఐ చలమల రాజేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానులకు జరిమానా విధించినట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

అంతర్వేది,(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్లలోపు ఉన్న పాన్, కూల్‌డ్రింక్ షాపులను సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గుట్కా, పాన్ ప్యాకెట్లు అమ్ముతున్న షాపులను తనిఖీచేసి ఎనిమిదిమంది షాపు యజమానులు రూ.1600జరిమానా విధించినట్టు తెలిపారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం పలు ప్రాంతాల్లో పాన్ షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. కందికుప్ప, దొంతికుర్రు, కాట్రేనికోన, చెయ్యేరుల్లో పాన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి పది మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు వందమీటర్ల లోపులో పొగా ఉత్పత్తులు విక్రయించరాదని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆదేశించారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం ముమ్మిడివరంలోని పలు పాన్‌షాపులు, టీ పాయింట్లు తదితర దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న 26దుకాణాలపై కేసులు నమోదుచేసి రూ.5200 జరిమానా విధించారు. వారివెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సన్మానం
అమలాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. 79కిలోల విభాగంగా బి.యశ్వంత్ స్వర్ణ పతకం సాధించడంతో పాటు స్ట్రాంగ్‌మెన్ అవార్డును దక్కించుకున్నాడు. 65కిలోల విభాగంలో జె.జితేంద్రదొర స్వర్ణ పతకం, 63కిలోల విభాగంలో యు.శశికళ స్వర్ణ, 69కిలోల విభాగంలో వై.ఇందిర రజత పతకాలు దక్కించుకున్నారు. మంగళవారం అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో గారపాటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన క్రీడాకారులను సత్కరించారు. క్రీడాకారులు, టీమ్‌కోచ్‌గా వ్యవహరించిన సీనియర్ వెయిట్ లిఫ్టర్ మారే వీరేంద్రను ఘనంగా సత్కరించారు. అల్లాడ వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, పీఈటీ వి.బుజ్జి, యనమదల పల్లంరాజు, గంగుమళ్ల దొరబాబు, ముమ్మిడివ ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ


కందికుప్పలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కాట్రేనికోన, జూలై 8(ఆంధ్రజ్యోతి): కందికుప్ప పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మంగళవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఎకరానికి 60మొక్కలు రైతులకు ఉపాధి పథకం ద్వారా అందిస్తారని ఎమ్మెల్యే అన్నారు. నాటిన మొక్కల సంరక్షణ ఖర్చు మూడేళ్ల పాటు ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోకో పంటకు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి
అంబాజీపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): కొబ్బరిలో అంతర పంటగా కోకో పంటను సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం అందుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని పోతాయిలంక ముత్యాల సత్యనారాయణ కొబ్బరి తోటలో అంతర పంట కోకో మొక్కలను నాటారు. నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, రైతు సంఘ నాయకులు ముత్యాల జమ్మీలు, ఏపీవో అడపా వెంకటకృష్ణ, నాయకులు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

మెగా పీటీఎంపై డిప్యూటీ కలెక్టర్ సమీక్ష
రాజోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి అధ్యక్షతన ఈనెల10న జరగబోయే మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌పై మండలస్థాయి అధికారులు, తహశీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, మండల అభివృద్ధి అధికారి డి.రాంబాబు, ఎంఈవోలు ఎన్.మనోహరం, టీఎస్కేడీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి
అమలాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని శ్రీచైతన్య టెక్నో స్కూలు ఆధ్వర్యంలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డీవైఈవో గుబ్బల సూర్యప్రకాష్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో మొక్కలు నాటించి పర్యావరణ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులతో స్కూలు క్యాంపస్ నుంచి గడియార స్తంభం వరకు చేపట్టిన ర్యాలీని పాఠశాల ప్రిన్సిపాల్ వసు ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు చేతబూని పర్యావరణ నినాదాలతో మొక్కలు నాటండంటూ ప్రజల్లో చైతన్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ పిల్లా శ్రీనివాస్, కోఆర్డినేటర్ జి.శ్రీనివాస్, డీన్ టి.రాజేష్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి అరవ శ్రీను, ఇన్‌చార్జి జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి


వైఎస్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్, పినిపే శ్రీకాంత్

అమలాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ జయంతిని మంగళవారం కోఆర్డినేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూలు సెంటర్‌లో నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌ల సమక్షంలో శ్రీకాంత్ కేక్ కట్‌చేశారు. అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. హరిమనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, నాయకులు కుడుపూడి బాబు, సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, గుత్తుల చిరంజీవి, కొల్లాటి దుర్గాబాయి, ఉండ్రు వెంకటేష్, సరెళ్ల రామకృష్ణ, సూదా గణపతి, షేక్ అబ్దుల్ ఖాదర్, ఈతకోట శ్రావణ్, కేతా భానుతేజ, పొగాకు శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే దేవ
మామిడికుదురు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కరవాక గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరవాక గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, చాగంటిస్వామి, మొల్లేటి శ్రీను, బోనం బాబు, సాగి బాబ్జిరాజు, ఎంపీడీవో జి.భవానీ, ఉండపల్లి అంజి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన
ముమ్మిడివరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ ముమ్మిడివరంలో మంగళవారం వారు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులంతా నగర పంచాయతీ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఎం.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, వై.రమణ, కె.శరత్, జి.చందు, కె.ఈశ్వర్‌నాథ్, జి.ప్రదీప్, దొంగ ప్రసాద్, ఎస్.రామరాజు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని నిరసన
రాజోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ సమగ్రశిక్షలో భాగంగా రాజోలు మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తోన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు హెచ్‌ఆర్ పాలసీని అమలుచేయాలని స్థానిక మండల రిసోర్సుసెంటర్ ఎదుట మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి
అంబాజీపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని పీర్మాయిపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువతి సోమవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మాచవరం పరిధిలోని కొర్లపాటివారిపాలానికి చెందిన మిండుగుదటి ధనలక్ష్మి(21) ఈనెల5న మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మోటార్‌సైక్లిస్టు ఎదురుగా వచ్చి ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. దీంతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనలక్ష్మి సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. సోదరుడు సిద్ధివినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వి.సత్యనారాయణ తెలిపారు.

హిందీ ప్రచారసభ పరీక్షలో విద్యార్థుల ఉత్తీర్ణత
అయినవిల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మార్చి నెలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పరీక్షల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 6వ తరగతి నుంచి 25మంది, 8,9 తరగతుల నుంచి ఇద్దరేసి విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వారికి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని ఎన్.గంగాభవానీని అభినందించారు. ఉపాధ్యాయులు వీది దుర్గారావు, వై.ఫణికుమార్, జి.సాయిశ్రీనివాస్, నేరేడుమల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త కనపడకుండా చూడండి
మామిడికుదురు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త కనపడకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి పేర్కొన్నారు. పంచాయతీ అధికారి మంగళవారం మామిడికుదురులో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజా సహకారంతోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం అమలవుతుందన్నారు. ఈదరాడ లో డీఎల్పీవో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల ఉధృతికి చెక్
రాజోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గి విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తుతాయని మండల వ్యవసాయ శాఖాధికారి మధుకుమార్ తెలిపారు. పొదలాడ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడలి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది జరిగింది. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి పి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో దేశీయ ఆవు ఉంటే 30ఎకరాల వ్యవసాయం చేయవచ్చని తెలిపారు. ఐసీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.25 లక్షలు

ఆత్రేయపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళ వారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక రోజు ఆదాయం రూ.3,25,158 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన ఏలూరి ఎస్ఎస్ దివాకర్, సరళాదేవి దంపతులు రూ.1,05,001 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు.





రామచంద్రపురంలోని పాన్‌షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు. పక్క చిత్రంలో కె.గంగవరంలోని కిరాణా షాపులో తనిఖీలు జరుపుతున్న ఎస్ఐ జానీబాషా

పాఠశాల పరిసరాల్లో పోలీసుల తనిఖీలు

కె.గంగవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు దగ్గరలో ఉన్న పాన్‌షాపుల్లో సిగరెట్లు, గుట్కా వంటి వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని పాఠశాలలకు దగ్గరలో ఉన్న పాన్ షాపులను తనిఖీలు చేశారు. విద్యార్థులకు సిగరెట్లు తదితర వస్తువులు విక్రయించరాదని తెలిపారు.

గుట్కా విక్రయాలపై తనిఖీలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిధిలో గుట్కా, సిగరెట్లు, మత్తు పదార్థాల విక్రయాలపై సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న పలు బడ్డీషాపుల్లో తనిఖీలు జరిపారు. ఆయా షాపులలోని గుట్కా, పాన్‌మసాలాలు, సిగరెట్లు స్వాధీనపరుచుకుని షాపు యజమానులకు ఫైన్ విధించినట్టు సీఐ తెలిపారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): సేవ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అయిదు షాపుల్లో తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం విధించారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారితో మంత్రి సుభాష్

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయం ద్వారా జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన 40 మందికి మంత్రి నియామక పత్రాలు అందచేశారు. రామచంద్రపురం ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్‌కుమార్, సీఈవో అనిల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి ఇప్పటి వరకు 350 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. జాబ్ మేళాల నిర్వహణ నిరంతర ప్రక్రియగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టి కనస్ట్రక్షన్స్, హంటర్ డౌగ్లస్, విఠల్ పేపర్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్‌వీఆర్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

మండపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి ఎస్‌వీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని వైద్యురాలు డాక్టర్ రమాదేవి అన్నారు. ద్వారపూడిలో ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టీ సుంకర నాని తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకర వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతి ఏటా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. రక్తదానం ద్వారా ప్రాణదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు రక్తదానం చేయగా, వారికి ట్రస్టు తరపున హెల్మెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీతోపాటు చిక్కాల శ్రీను, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, గ్రామ ఉపసర్పంచ్ తులా శేషారావు తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ అందజేస్తున్న దృశ్యం

మెగా పేరెంట్ సమావేశాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్‌కుమార్

కొత్తపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో 10న నిర్వహించే మెగా పేరెంట్ సమావేశాలను విజయవంతం చేయాలని కొత్తపేట ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉన్నత, ప్రైమరీ పాఠశాలల హెచ్ఎంలతో పేరెంట్ మీటింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం పర్యవేక్షణాధికారులను నియమించిందని తెలిపారు. సమావేశంలో తహశీల్దారు వై.రాంబాబు, ఎంఈవోలు ఎం. హరిప్రసాద్, కె.లీలావతి, పర్యవేక్షణాధికారి రెడ్డి, ఈవోపీఆర్డీ సత్తిబాబు, ఆర్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

జంగాల కాలనీలో ఎన్నికల హామీ పరిష్కారం

ఆత్రేయపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ఉచ్చిలి బుడగ జంగాల కాలనీలో డ్రెయిన్ మూసుకుపోవడంతో వర్షానికి ఈ కాలనీ జలమయమవుతోంది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కాలనీవాసులు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. అప్పట్లో ఆయన సొంత నిధులతో డ్రైనేజీపై తూరలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ మేరకు తెలుగు యువత మండల అధ్యక్షుడు వెత్సా అనిల్ ఆధ్వర్యంలో డ్రైనేజీని శుభ్రం చేయించి తూరలు ఏర్పాటు చేశారు. దీంతో జంగాల కాలనీవాసుల సమస్యకు పరిష్కారం అవడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.



డ్రైనేజీ తూరలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వ్యాపారవేత్త మృతికి సంతాపం

కపిలేశ్వరపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అంగర గ్రామానికి చెందిన వ్యాపారవేత్త డి.లక్ష్మణమూర్తి(81) సోమవారం రాత్రి వృద్ధాప్యంతో మృతి చెందారు. గతంలో ఆయన ఉపసర్పంచ్‌గా, ఆర్యవైశ్య సంఘం అంగర కమిటీకి 25 ఏళ్లపాటు పనిచేశారు. ప్రస్తుతం ఆయన శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు డి.ప్రభాకర సుబ్బారాయుడు, పట్టాభి రామస్వామి కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, మాజీ సర్పంచ్ ఎస్.స్వామికాపు, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ కార్యదర్శి పి.రామస్వామి తదితరులు సంతాపం తెలిపారు.

రేపు మెగా పేరెంట్ కమిటీ సమావేశం

రావులపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ డేని 10న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. దీనికి తప్పనిసరిగా తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారని తెలిపారు.



రామచంద్రపురం పట్టణంలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్



రాయవరం మండలం వెదురుపాకలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో అభివృద్ధిని వివరిస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

• సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల • ప్రజలతో మమేకమైన నేతలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం కల్పించామని మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం పట్టణంలో 7, 8, 9 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు ఇంటింటి పర్యటన చేశారు. ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వార్డు ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు అందజేశారు. మై టీడీపీ యాప్‌లో ప్రజల అభిప్రాయాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్ ఎన్ని కుతంత్రాలు చేసినా రాష్ట్ర అభివృద్ధిని ఆపలేరని అన్నారు. తన పాలన నచ్చితే ఓట్లు వేయాలని గత ఎన్నికల్లో జగన్ అడిగారని ఆయన పాలన నచ్చక ప్రజలు 11 సీట్లు ఇచ్చారని అయినా బుద్ధి రాలేదన్నారు. జగన్ మళ్లీ వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందదని ప్రజలే చెబుతున్నారని వారన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు కాకినాడ రామారావు, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, గరిగిపాటి సూర్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని లొల్ల, వెదురుపాక గ్రామాల్లో ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. కూటమి ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను వివరించారు. లొల్ల, వెదురుపాక గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే: మండలంలోని వెదురుపాక గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ నిధులతో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన 10 సీసీ రోడ్లు, డ్రైన్లు ఎమ్మెల్యే ప్రారంభించారు. వెదురుపాకలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చిన్నకృష్ణంరాజు తదితరులతో పాటు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు టేకుమూడి శ్రీనివాస వరప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ మల్లిడి భాస్కరరెడ్డి తదితరులతోపాటు బీజేపీ నాయకురాలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. లొల్ల గ్రామంలో ఎంపీటీసీ వైట్ల సతీష్, సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు సుంకవిల్లి గంగరాజు, పాతూరి అప్పారావు, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వివరించిన శ్రేణులు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మంగళవారం ఆత్రేయపురం మండలంలోని పార్టీ శ్రేణులు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రభుత్వ పథకాలు, పాలనపై అభిప్రాయాలను యాప్‌లో నమోదు చేశారు. మెర్లపాలెంలో సర్పంచ్ మెర్ల రాము, మెర్ల లక్ష్మీపతి తదితర పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి యాప్‌లో నమోదు చేశారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వెలిచేరులో నాగిరెడ్డి సత్యనారాయణ, కవల సత్తిబాబులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాంత్రం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.1.10 లక్షల ఆర్థికసాయం చేశారు. బాలాంత్రం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహిం చిన కార్యక్రమంలో రెండు కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న విషయాన్ని కూటమి నాయకుల ద్వారా తెలుకున్నారు. రెండేళ్ల క్రితం మాధవరపు లోవరాజు కాలువలో పడి మృతి చెందారు. అతనికి ఇద్దరు కుమార్తెలు కాగా, వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఉన్న సంగతిని తెలుసుకున్న మంత్రి వారికి రూ.లక్ష చెక్కును అందజేశారు. వారం రోజుల క్రితం విత్తనాల వెంకట రమణ రోడ్డు ప్రమా దంలో గాయపడి చికిత్స పొందుతూ మంచానికే పరిమితమయ్యారు. దీంతో వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కూట మి నాయకులు ముళ్లపూడి బుజ్జి, మేడిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి, జెడ్.మేడపాడులో..

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఏడాదిపాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకుపోయిందని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం జెడ్.మేడపాడు, ద్వారపూడి గ్రామాల్లో మంగళవారం జరిగిన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. ప్రభుత్వ పనితీరును ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జెడ్.మేడపాడు గ్రామంలో ఎమ్మెల్యే వేగుళ్ల కొబ్బరి మొక్కలు నాటారు. కొబ్బరి, ఇతర ఉద్యానపంటలగురించి ఉపాధి హామీ ఏపీఎం వివరించారు. కార్యక్రమంలో జెడ్.మేడపాడు గ్రామ సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి తదితరులతో పాటు, జనసేన నాయకుడు చింతా దొరబాబు, సత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం దూసుకుపోతోందని టీడీపీ నాయకులు అన్నారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, కాసా విద్యాసాగర్, అల్లూరి కృష్ణంరాజు తదితరులతో పాటు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్లలో కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎంపీ హరీష్, మంత్రి సుభాష్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ద్రాక్షారామ, జూలై 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో బంగారు చెరువు చెట్టు వద్ద 200 కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీ హరీష్‌మాధుర్‌తో కలసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతకు మొక్కలు ఉపకరిస్తాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం అనుసంధానంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో గణపతి, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, జేఈ ఈశ్వరరావు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక కార్యవర్గం ఎన్నిక

ద్రాక్షారామ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో జనవిజ్ఞాన వేదిక విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో పెరుగుతున్న సాంకేతికత తగ్గుతున్న ఉపాధి అవకాశాలు అంశంపై సైన్సు జిల్లా అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం వివరించారు. అనంతరం రామచంద్రపురం మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల గౌరవాధ్యక్షుడిగా జీవీఎస్ సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా డాక్టర్ క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి కనకరాజశేఖర్, మహిళా అధ్యక్షురాలిగా పసుపులేటి మెహర్ సుజాత, సంయుక్త కార్యదర్శిగా నాగేంద్ర, ప్రచార కార్యదర్శిగా సమయమంతుల సతీష్, ఉపాధ్యక్షులుగా పలివెల ప్రసాద్, కె.ధనలక్ష్మి తదితరులను ప్రకటించారు.

'ఈదల' మృతికి సంతాపం

ఆలమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ ఏడీ నాన్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఆలమూరు మండలం పినపళ్ల గ్రామీణ పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్(61) మంగళవారం మృతి చెందారు. ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో రాజమండ్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయన జొన్నాడ, గుమ్మిలేరు, మూలస్థానం, పినపళ్ల, చింతలూరు గ్రామీణ పశువైద్యశాలలో పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతి పట్ల పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా వైఎస్ జయంతి

రాయవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. మండలంలోని వెదురుపాక, కురకాళ్లపల్లి గ్రామంలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. కురకాళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి శారద, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ జయంతి సందర్భంగా రావులపాలెంలోని వైఎస్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు సిరివరపు శ్రీనివాసరావు తదితరులు వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. అనంతరం అంధుల పాఠశాల విద్యార్థులకు బిస్కెట్స్ వంటివి పంపిణీ చేశారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం, పామర్రు గ్రామాల్లో మంగళవారం వైఎస్ జయంతిని పార్టీ నాయకులు నిర్వహించారు. గంగవరంలో వైఎస్ విగ్రహం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పి.నాగమణి, జడ్పీటీసీ ఓ.శ్రీవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఆలమూరు మండలంలో మంగళవారం నిర్వహించారు. ఆలమూరు, జొన్నాడ, చెముడులంక, మడికి, మూలస్థానం, చింతలూరు గ్రామాల్లో వైఎస్ విగ్రహాలకు ఆ పార్టీశ్రేణులు నివాళులర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, రావాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ జయంతిని ఆ పార్టీశ్రేణులు నిర్వహించారు. ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్లో మాజీ జడ్పీటీసీ చిలువూరి రామకృష్ణంరాజు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పత్సమట్ల రాజగోపాలరాజు తదితరులు వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు. నార్కెడిమిల్లిలో సర్పంచ్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని జరిపారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో దివంగత వైఎస్ జయంతి సందర్భంగా అంగర, టేకి, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ విగ్రహాలకు నివాళులర్పించారు. కపిలేశ్వరపురం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

రామచంద్రపురం (ద్రాక్షారామ) (ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ జయంతిని మంగళవారం రామచంద్రపురంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, సూర్యప్రకాష్‌తో పాటు పలువురు కార్యకర్తలు, నాయకులు, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో వైఎస్ జయంతి వేడుకలను పలువురు నిర్వహించారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం సాయం

ఆత్రేయపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల తోటల పెంపకానికి ఆర్థికసాయం అందిస్తునట్లు ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. మంగళవారం లొల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కల్లూరి లక్ష్మీనారాయణ వ్యవసాయ క్షేత్రంలో పండ్ల మొక్కల పెంపకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పండ్లు, పూలసాగుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్నదని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాయల జగన్నాధం, కూటమి శ్రేణులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చేతిపంపులు పరిశీలన: అంకంపాలెంలో 30 చేతి పంపులను ఎంపీడీవో వెంకటరామన్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా టెస్టులు చేయించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పండ్ల తోట పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఆలమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి రాయితీపై మొక్కలను సరఫరా చేసి ప్రభుత్వం ప్రోత్సహాన్ని ఇస్తున్నదని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. జొన్నాడలో పండ్ల తోట పెంపకానికి రైతులకు అందించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం లో సర్పంచ్ శ్రీనివాస్, ఏపీవో అరుణకుమారి, చింతలూరు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ చౌదరి, వైట్ల గంగరాజు, నాయకులు ఎ.సత్తిబాబు, కట్టా ప్రసాద్, పలువురు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



పసలపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో

వ్యవసాయశాఖ అధికారుల సూచనలు రైతులు పాటించాలి

రాయవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి, కూర్మాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మండల అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ మాట్లాడుతూ సొంత భూమి లేని రైతులు కౌలు కార్డులు పొంది పంట నమోదు చేసుకుంటే అన్నదాతా సుఖీభవ పథకం వర్తించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సాగుపై ఆయా గ్రామాల రైతులకు పలు సలహాలు, సూచనలు ఏవో అందజేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి ఆదిరెడ్డి, మల్లిడి అమర్నాథరెడ్డి, మతుకుమిల్లి భాస్కరరావు, ముత్యాల చిన్నబ్బు తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకం రైతులకు మేలు



కండ్రిగలో పండ్ల మొక్క నాటుతున్న ఎంపీడీవో నరేష్‌కుమార్

కొత్తపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఉద్యానవన రైతులు పండ్ల తోటల పెంపకం చేపడితే ప్రయోజనం చేకూరుతుందని కొత్తపేట ఎంపీడీవో నరేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కండ్రిగ గ్రామంలో ఉద్యానవన రైతులు బి.రాంబాబు పొలంలో పండ్ల తోటల పెంపకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు ఉద్యానవన పంటల్లో మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, కొబ్బరి, ఆయిల్‌ఫామ్, కోకో వంటి పంటలు పండించడం ద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దూనబోయిన నవదీప, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

కె.గంగవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందాలని వ్యవసాయశాఖ మండల అధికారి ఏ.సద్గురు మూర్తి అన్నారు. మంగళవారం సత్యవాడ, పాణింగపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందగోరు రైతులు మీసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కూటమి నాయకులు బలుసు నాగేంద్ర, బలుసు కృష్ణప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.